క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నరసరావుపేట: స్థానిక డిపో ఆవరణలో బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రయాణికుల సూచనలు, సలహాలు స్వీకరించి, మెరుగైన సేవలు అందజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు 99592 25428 నంబరుకు డయల్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

వినుకొండలో..

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన సేవలు, సౌకర్యాలు కల్పించేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డీఎం బి.కోటేశ్వరరావు నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో 99592 25431 నంబరుకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

12న అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు అతిథి అధ్యాపకుల కోసం ఈ నెల 12న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. హిస్టరీకి ఎం.ఎ (హిస్టరీ), పీడీ పోస్టుకు (ఎంపీడీ) విభాగాల్లో 55శాతం ఉత్తీర్ణత ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 98483 28270ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఫ్లెక్సీ చించివేత



నరసరావుపేట రూరల్: మండలంలోని కాకానిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చించేశారు. నూతన సంవత్సరం సందర్భంగా సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ గ్రామంలోని వినాయకుడి గుడి వద్ద ఎంపీటీసీ దండా వీరాంజనేయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించి వేయడంతో.. మంగళవారం ఉదయం దీనిని గుర్తించిన వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు సమాచారం అందించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నాదెండ్ల: కనపర్రు శివారు మైనంపాడు ప్రాథమిక పాఠశాల రోడ్డులో ఓ వ్యక్తి మద్యం అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్సై జె.బలరాంరెడ్డి వివరాల మేరకు.. సోమవారం రాత్రి స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన మాలె అశోక్ మద్యం విక్రయిస్తుండగా.. పట్టుకున్నారు. ఓల్డ్ అడ్మిరల్ 15 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

నాదెండ్ల: మద్యం మత్తులో ఉన్న నలుగురు మరొకరిపై దాడికి పాల్పడి, గాయపరచిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నాదెండ్ల గ్రామానికి చెందిన బిరుదు సత్యవర్ధచంద్ర ఈ నెల 7న రాత్రి ఇంటికి వెళ్తుండగా సినిమాహాల్ సెంటర్ వద్ద కరుణాకర్, నరేంద్ర, కుమార్, శేషయ్య అనే నలుగురు మద్యం సేవిస్తూ అతనితో ఉద్దేశపూర్వకంగా తగాదా పడ్డారు. దాడి చేసి, అతనిని గాయపరిచారు. బాధితుడిని కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

నూతన పింఛన్లు అందజేత

నరసరావుపేట: స్థానిక 14వ వార్డు సచివాలయంలో ఏడుగురికి నూతనంగా మంజూరైన పింఛన్లను వార్డు ఇన్‌చార్జీలు బండి వెంకటేశ్వరరెడ్డి, పాతర్ల చిన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ టెస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు ఆవరణలో ఈ నెల 12న రెండు నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్కాలర్ షిప్ టెస్టు నిర్వహించనున్నట్లు స్కూలు యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మార్కాపురం, కనిగిరి డివిజన్లలోని 18 ప్రధాన పట్టణాల్లో విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి ట్యాబు, మొబైల్ ఫోన్, నగదు బహుమతులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వివరాలు, పేర్ల నమోదుకు 95057 41777, 95057 42777 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు ఎనలేనివి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన జేసీ శ్యాంప్రసాదు, అధికారులు, విద్యార్థులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, నాయకులు

విద్యార్థులతో జేసీ శ్యాం ప్రసాదు జన్‌భగీరధి ర్యాలీ

నరసరావుపేట: భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు పేర్కొన్నారు. ఈ నెల 19న విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభం పురస్కరించుకొని మంగళవారం జన్ భగీథరి మార్చ్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గడియారం స్తంభం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వరకు విద్యార్థులు, కుల సంఘ నాయకులతో చేపట్టిన ర్యాలీని జేసీ ప్రారంభించి, పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి జిల్లాలో అన్ని గ్రామాలు, సచివాలయాల పరిధిలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, గ్రామాల్లో పెద్దలతో సమావేశాలు, అంబేడ్కర్ విగ్రహాల వద్ద సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ పీడీ ఓబులు నాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, జిల్లా ఎస్సీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మల్లెల అశోక్, సుబ్బారావు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నాదెండ్ల ఎంపీడీవో నివాళి

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణను జయప్రదం చేద్దాం

నరసరావుపేట: భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా.. ప్రకాష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పోస్టర్ ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణను జయప్రదం చేయాలని కోరారు. అలాగే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పూర్తయ్యి.. ఐదేళ్లు అయిన సందర్భంగా కేక్ కటింగ్ చేశారు. అణగారిన వర్గాలను చంద్రబాబు మోసం చేస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు సమ న్యాయం చేసిందని పేర్కొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్

నాదెండ్ల: భారత రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. నాదెండ్ల 1వ సచివాలయం వద్ద మంగళవారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల భారీ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఆవిష్కరించనుందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రపై అవగాహన కల్పించారు. విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని కోరారు. ఎంఈఓలు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యల్లారావు, పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు, వీఆర్వో చైతన్య, ఏపీవో పుష్పరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆరోగ్య సురక్ష’ వైద్య శిబిరాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

రొంపిచర్ల: విప్పర్లపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 338 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ రవి తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులకు, సిబ్బందికి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హర్షవర్ధన్, డాక్టర్ ఎన్.సాయిబాబు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

13న పూర్వవిద్యార్థుల సమ్మేళనం

యడ్లపాడు: మండల కేంద్రంలోని లూథరన్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీక సమావేశం నిర్వహించనున్నట్లు పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 1990 -1995 మధ్య విద్యనభ్యశించిన విద్యార్థులు 110 మంది ఈ నెల 13న ఉదయం 10 గంటలకు పాఠశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాధించిన సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు

శావల్యాపురం: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కొనియాడారు. మండలంలోని కనమర్లపూడి, మతుకుమల్లి గ్రామ పంచాయతీల్లో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవన సముదాయాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభల్లో ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజల సొమ్ము దోచుకున్నారని విమర్శించారు. కనమర్లపూడి గ్రామంలో ప్రారంభోత్సవానికి సంబంధించి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గ్రామంలోని కొందరు టీడీపీ కార్యకర్తలు చించివేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల్లో పోటీ పడాలని ఈ విధంగా ఫ్లెక్సీలు చించివేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తన్నీరు భారతి, యలగాల బసవయ్య, ఎంపీటీసీ సభ్యులు మరియమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, డీటీ పేరిసోముల నాసరయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు అంకారావు, బోడెపూడి కొండలు, చింతల వెంకటేశ్వర్లు, కావూరి మాబు సుభానయ్య, మలిశెట్టి నరేష్, ముంద్రు జీవా ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మాట ప్రకారం దశల వారీగా పింఛను పెంపు



మతుకుమల్లి గ్రామ సచివాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

అవ్వాతాతలకు పింఛను నగదు దశల వారీగా పెంచి, ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మాట్లాడుతూ.. మండలంలో 5,968 మంది పింఛనుదారులు ఉండగా.. ఈ నెలలో 107 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్స్, రోడ్డును, రైతుభరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ భీమని అంకారావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు దూదెకుల హుస్సేన్, ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, డీటీ పెరిసోముల నాసరయ్య, ఏఓ పి.ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాత్‌జోన్ బాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరక్టర్ డాక్టర్ వైవీ నారాయణ

నరసరావుపేట రూరల్: సౌత్ జోన్ అంతర పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌కు తమ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు సాయి తిరుమల నలబోతు వెంకట్రావు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాదరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడా పోటీలు జరిగాయని తెలిపారు. విద్యార్థులు బోరుగడ్డ జాయ్ కుమార్, ఎస్కె రహమాన్ బాడ్మింటన్‌లో ప్రతిభ చాటారని చెప్పారు. సింగిల్స్ విభాగంలో జాయ్‌కుమార్, డబుల్స్‌లో జాయ్‌కుమార్, రహమాన్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వైవీ నారాయణ, వ్యాయామ అధ్యాపకుడు బి.ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు అభినందించారు.

11న కె-రిడ్జిలో స్కాలర్‌షిప్ టెస్ట్



పోస్టర్ విడుదల చేస్తున్న చైర్మన్ నాతాని

నరసరావుపేట ఈస్ట్: స్థానిక గుంటూరు రోడ్డులోని కె-రిడ్జి పాఠశాలలో ఈ నెల 11న గురువారం 2 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. టాలెంట్ టెస్టును నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, పెదకూరపాడు, పెదనందిపాడు, ప్రకాశం జిల్లా పరిధిలోని దర్శి, మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కంభం, మార్టూరు వంటి దాదాపు 20 ముఖ్య కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు వివరించారు. గణితం, ఇంగ్లీష్, లాజికల్ థింకింగ్‌లో గంటన్నర వ్యవధితో కూడిన ప్రశ్నా పత్రం ఉంటుందని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 17న పాఠశాలలో నిర్వహించనున్న కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా బహుమతులు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా టాలెంట్ టెస్ట్ పోస్టర్లు ఆవిష్కరించారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ బర్నబాస్, ప్రిన్సిపల్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

సామాన్యుల కలలు సాకారం చేసిన జగనన్న

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: ప్రజల కష్టాలు, కన్నీళ్లను తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా చూసి, జనరంజక పాలనకు శ్రీకారం చుట్టిన సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పేర్కొన్నారు. సీఎం జగన్ ప్రజాసంకల్ప యాత్ర ముగిసి ఐదేళ్లు అయిన సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా భాస్కర సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయుడు మాట్లాడుతూ జగనన్న నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్ర జనం గుండెల్లో చెరగని జ్ఞాపకంలా మిగిలే ఉందన్నారు. దేశ చరిత్రలోనే ప్రజా సంకల్పయాత్ర మరుపురాని ఘట్టమని అభివర్ణించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం సామాన్యుల కలలను సాకారం చేసే విధంగా, పేదల బతుకులకు భరోసా కల్పించేలా అమలవుతున్నాయని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కొనసాగుతున్న పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవడానికి ప్రజలు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడానికి కృతనిశ్చయంతో ఉన్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు క్లస్టర్–1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్ -2 విడదల కమలేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వలేటి వెంకటేశ్వరరావు, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, పార్టీ చిలకలూరిపేట, యడ్లపాడు, మండలాల అధ్యక్షులు గుత్తా యాములయ్య, గంటా శంకర్, ఎంపీపీలు దేవినేని శంకరరావు, పిడతల ఝాన్సీ, జెడ్పీటీసీ సభ్యులు కోడె సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్ రావు, ముక్తా వాసు, సొసైటీల అధ్యక్షులు కొండవీటి ఆంజనేయులు, మంగు ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పందుల పెంపక కేంద్రం పరిశీలన

రొంపిచర్ల: దాసరిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సీమ పందుల పెంపక కేంద్రాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కాంతారావు మంగళవారం పరిశీలించారు. ఆ గ్రామానికి చెందిన కొండా అంజమ్మ ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కింద ఈ కేంద్రాన్ని రూ.60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని పరిశీలించి, నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. పెంపక కేంద్రం వ్యయంలో 50 శాతం ప్రభుత్వం రాయితీ కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహులు, ఏడీ వెంకటేశ్వరనాయక్, వైద్యాధికారులు శ్రీకాంత్, సాయి మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆసుపత్రులకు వెళ్లి..



వృద్ధురాలికి పింఛను ఇస్తున్న వలంటీరు సుమ

యడ్లపాడు: మండలంలోని కొండవీడు గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ రహీమ్ కంటి శుక్లం ఆపరేషన్ నిమిత్తం చినకొండ్రుపాడులోని కాటూరి మెడికల్ హాస్పిటల్‌లో చేరాడు. వలంటీర్ ఐ.వెంకటేశ్వరరావు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి అతనికి రూ.3వేల పెన్షన్ అందజేశాడు. యడ్లపాడు గ్రామానికి చెందిన వృద్ధురాలు గార్లపాటి కల్యాణకుమారి గుంటూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ ఎడ్లూరి సుమ గుంటూరు వెళ్లి వృద్ధాప్య పింఛను అందజేశారు. పింఛనుదారుల కుటుంబ సభ్యులు వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

మహనీయుడు డాక్టర్ జాన్‌డేవిడ్

చిలకలూరిపేట: స్వచ్ఛంద సంస్థలు స్థాపించి, ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు డాక్టర్ ఎస్.జాన్ డేవిడ్ అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పేర్కొన్నారు. ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్, ఫోర్ కార్నర్స్ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.జాన్‌డేవిడ్ వర్ధంతిని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి మల్లెల రాజేష్ నాయుడు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది పేదలను, అనాథలను ఆదుకున్నారని, చిలకలూరిపేట మంచినీటి చెరువుల నిర్మాణానికి సహకరించి, పట్టణ ప్రజల దాహార్తి తీర్చిన మహనీయుడని కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, డిప్యూటీ డైరెక్టర్ కెజియా మహంతి, ఫోర్ కార్నర్స్ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ జెస్సీ ఎస్ బర్నబాస్, డాక్టర్ సులక్షన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో..ముందస్తు సంక్రాంతి



డూడూ బసవన్న ఆటలు



భోగిమంట వెలిగిస్తున్న చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి విద్యా సంస్థలు, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు మంగళవారం అంబరాన్నంటాయి. ఏఎంరెడ్డి కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు భోగి మంటలు వెలిగించి, సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు.

వన్‌టౌన్ సీఐగా కృష్ణారెడ్డి బాధ్యతలు

నరసరావుపేట టౌన్: వన్ టౌన్ సీఐ గా సి.కృష్ణారెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి కమాండ్ కంట్రోల్ విభాగంలో సీఐగా పని చేస్తూ బదిలీపై నరసరావుపేటకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పనిచేసిన ఎ.అశోక్ కుమార్ పల్నాడు జిల్లా డీసీఆర్బీకి బదిలీ అయిన విషయం తెలిసిందే. సీఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వన్‌టౌన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు.

బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలకు ఆహ్వానం

రొంపిచర్ల : కొత్తపల్లి గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఈ నెల 12, 13 తేదీల్లో మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి యువత ఆధ్వర్యంలో 12న బ్యాడ్మింటన్, 13న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు ముందు రోజు ఎంట్రీ ఫీజు చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 83416 26019, 63022 57030 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఫ్లెక్సీలకు అనుమతి తప్పనిసరి

శావల్యాపురం: మండలంలో ఫ్లెక్సీలు రగడ నెలకొంది. నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు చెప్తూ..రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు వివాదాలకు నిలయమవుతున్నాయి. మంగళవారం కనమర్లపూడి గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీని.. టీడీపీ కార్యకర్తలు చించి వేశారు. దీనిపై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అదేశాలు మేరకు గ్రామంలో ఇరు పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను ఎస్సై తుళ్ళూరి తిరుపతిరావు తొలిగించారు. సీఐ సుధాకర్ స్పందిస్తూ.. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లెక్సీల ఏర్పాటుకు పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టంచేశారు. ముందుస్తుగా పోలీసులకు చెప్పాలన్నారు. రెండు రోజులకు మించి ఫ్లెక్సీలు ఉంచకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్యకర్త

శావల్యాపురం: మతుకుమల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కొండారి అనిల్ మంగళవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీ కండువా కప్పి ఆయనకు ఎమ్మెల్యే స్వాగతం పలికారు.

నేటి నుంచి మండల స్థాయి ‘ఆడుదాం ఆంధ్రా’

నరసరావుపేట రూరల్: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి. శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని వివరించారు. మండలంలోని 25 గ్రామ సచివాలయాల నుంచి 225 క్రీడా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఐదు క్రీడాంశాలలో నిర్వహించే ఈ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు.